సాక్షి శ్రీకాకుళం

సోమవారం | 9 | సెప్టెంబర్ | 2024



నేలకొరిగిన చెట్టు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మల్లికార్జునపురం గ్రామం వద్ద చెట్టు శనివారం సాయంత్రం గాలికి నేలకొరిగిపోయింది. చెట్టు పడినప్పడు పాన్‌షాపు మూసి ఉండటంతో ప్రమాదం జరగలేదు.



'అల'కల్లోలం

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట తీరంలో ఆదివారం ఉదయం సాధారణం కంటే 250 అడుగుల మేర సముద్రం ముందుకు వచ్చింది. దీంతో దాదాపు 950 మీటర్లు మేర తీరం కోతకు గురైంది.

నేడు విద్యాసంస్థలకు సెలవు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ సూచనలు, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలన్నింటికీ సోమవారం సెలవు ప్రకటించినట్లు డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య తెలిపారు. భారీ వర్షాల కారణంగా సెలవు ప్రకటించారని, విద్యాసంస్థలు విధిగా సెలవు పాటించాలని డీఈఓ స్పష్టంచేశారు.

రెయిన్ ఎఫెక్ట్..



పొందూరు: చిన్నబొడ్డేపల్లి వద్ద అండర్‌పాసేజ్‌లో వరద నీటిలో వాహనాలు

- రణస్థలం మండలం వల్లభరావుపేటలో రెండు పూరిళ్లు నేలమట్టమయ్యాయి.
- సుభలయ కాలనీలో పాఠశాల ప్రహరీ కూలిపోయింది.
- నాగావళి నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీ తీర గ్రామాల ప్రజలు బిక్కు బిక్కు మంటున్నారు.
- పొందూరు మండలం చిన్నబొడ్డేపల్లి గ్రామం వద్ద రైల్వే అండర్ పాసేజ్‌లో భారీగా నీరు చేరడంతో కారు, ట్రాక్టర్, ద్విచక్రవాహనాలు చిక్కుకున్నాయి.
- నరసన్నపేట మండలంలోని గుండవల్లిపేటకు చెందిన ఓ ఆగ్రోఫుడ్ మిల్లుకు చెందిన ప్రహరీ కూలింది.
- పోలాకి మండలం, సారవకోట మండలాల్లో తంపర భూములు నీట మునిగాయి.
- అరసవల్లి సమీపంలో లక్ష్మీనగర్, కామేశ్వర నగర్, రాజీవ్‌నగర్ కాలనీ, ఇందిరానగర్ కాలనీల గుండా వస్తు న్న మిర్తిబట్టి పొంగి పొర్లేలా ఉంది.
- కుప్పిలి ఊట గడ్డ పోటెత్తింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పశు వైద్య కేంద్రం, అంగన్ వాడీ కేంద్రాల్లోకి నీరు చొచ్చుకు వచ్చింది. ధర్మవరం గ్రామ పంచాయతీ రుప్పపేటలో కొట్టుకుపోయిన రోడ్డును ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం పరిశీలించారు.



కుప్పిలి పశువైద్య కేంద్రం వద్ద పరిస్థితి

- మహేంద్ర తనయ నది పొంగి పొర్లుతుండడంతో పాతపట్నం నీలకంఠేశ్వరం ఆలయం వద్ద ఉన్న కాజ్‌వే బ్రిడ్జిపై నుంచి ఆదివారం సాయంత్రం మూడు అడుగుల మేరు నీరు పారింది.



మహేంద్రతనయ నది కాజ్‌వే వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు




టెక్కలి భూలోకమాత వీధిలో వర్షం కారణంగా కూలిన గోడ



దిగువకు గొట్టా నీరు..

హిరమండలం వంశధార గొట్టా బ్యారేజీ వద్ద ఆదివారం ఉదయానికి స్వల్పంగా వరద నీరు పెరిగింది. గొట్టా బ్యారేజీ వద్ద గరిష్టంగా 38.10 మీటర్లు నీటిమట్టం ఉండగా ప్రస్తుతం 38.07 నీటిమట్టం ఉంది. బ్యారేజీలోకి ఆదివారం నాటికి 7196 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వచ్చిన నీటిని 10గేట్లు 20 సెంటీమీటర్లు మేర పైకి ఎత్తి దిగువకు విడిచిపెట్టినట్లు డీఈ రంగనాయకులు తెలిపారు. అలాగే కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటి ప్రవాహాన్ని నిలుపుదల చేసినట్లు తెలిపారు. -హిరమండలం



ఉధృతంగా మడ్డువలస

మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద వరద నీరు ఉప్పొంగుతోంది. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి భారీ వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. మడ్డువలస వద్ద ఏఈ నితిన్ ప్రాజెక్టు వద్ద ఎనిమిది గేట్లు ఎత్తి సుమారు 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టడంతో ప్రాజెక్టు తీర గ్రామాలకు ముప్పు తప్పింది. ప్రాజెక్టు వద్ద 64.16 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైంది. - వంగర



ప్రాజెక్ట్ వాచ్

నిండుకుండలా తోటపల్లి

నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు నీటిమట్టం 105 మీటర్ల లెవెల్‌కుగాను ఆదివారం సాయంత్రానికి 103.80 మీటర్ల లెవెల్‌లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిపై భాగం నుంచి ప్రాజెక్టుకు 2,160 క్యూసెక్కుల వరద నీరు రాగా ఈమేరకు అధికారులు రెండు గేట్లు ఎత్తివేసి 1,851 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువల ద్వారా 310 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటిసామర్థ్యం 2.5 టీఎంసీలకుగాను 1.78 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు. -గరుగుబిల్లి

శ్రీకాకుళం పెద్దపాడు సమీపంలో హైవేను ముంచెత్తిన వరద..



కంట్రోల్ రూమ్.. వర్షాల కారణంగా భారీ నష్టాలకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ **08942-240557** కు ఫోన్ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు.



శ్రీకాకుళం రైతు బజారు కూడలి వద్ద..

వాన హైరానా..

- జిల్లాలో దంచికొట్టిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- భయం గుప్పెట్లో నదీ తీర ప్రాంత ప్రజలు

వాన దంచి కొట్టింది. నదులు, గెడ్డలు, ఏర్లు పొంగి పొర్లేలా ఏకధాటిగా కురిసింది. శనివారం మొదలైన జల్లు ఆదివారమంతాపడుతూనే ఉంది. ఈ సీజన్‌కు ఇదే అత్యధిక వర్షపాతం కావడం విశేషం. వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. శ్రీకాకుళం పరిసర ప్రాంతాలైతే చెరువులను తలపించాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని చిన్నాపెద్దా గెడ్డలన్నీ పొంగి ప్రవహించాయి. పాతపట్నం నియోజకవర్గంలోని నదీ పరివాహక ప్రాంతాలు భయం గుప్పెట్లో గడిపాయి. -సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం నగరంలో..

వర్షపాతం (మిల్లీ మీటర్లలో)

శ్రీకాకుళం	రణస్థలం	లావేరు	ఆమదాలవలస	పొందూరు	ఎచ్చెర్ల	సరుబుజ్జిలి	సోంపేట	వజ్రపుకొత్తూరు	జి.సిగడాం	కవిటి	నరసన్నపేట	పోలాకి	టెక్కలి
124.0	122.2	116.2	109.2	104.2	88.4	81.6	79.6	76.8	75.2	74.8	72.0	64.2	63.2

ఇచ్ఛాపురం	సారవకోట	సంతబొమ్మాళి	జలుమూరు	పలాస	నందిగాం	ఎల్ఎన్‌పేట	కంచిలి	బూర్జ	హిరమండలం	పాతపట్నం	కోటబొమ్మాళి	మెళియాపుట్టి	మందస	కొత్తూరు
60.4	58.6	58.0	55.4	50.4	50.2	48.6	47.8	47.0	41.6	40.0	38.2	37.0	34.8	23.6

పొంగుతున్న గెడ్డలు..

రణస్థలం మండలం జీరుపాలెం గ్రామంలో వరద నీరు ఇళ్లలోకి చేరింది. జీరుపాలెం, చిల్లపేట యర్రవరం మధ్య బుచ్చవాని గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది.

- ఎచ్చెర్ల మండలం కుప్పిలి ఊట గడ్డ పొంగిపొర్లుతోంది. ధర్మవరం గ్రామ పంచాయతీ రుప్పపేటలో రోడ్డు కొట్టుకుపోయింది.
- లావేరు మండలం గుర్రాలపాలెం, అదపాక గ్రామాల మధ్యనున్న గెడ్డ పొంగి రహదారి కొట్టుకుపోయింది.
- తామాడ రహదారి నుంచి రాయినింగారిపేట గ్రామానికి మధ్యలో బుడుమూరు పెద్దగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది.
- పొందూరు మండలంలో రెల్లిగెడ్డ, నారాయణపురం కాలువల గుండా వరదనీరు ఎక్కువగా ప్రవహిస్తోంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న బుడుమూరు పెద్దగెడ్డ

వాగులో వాహనం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడతవలస, బెజ్జిపురం మధ్యలో ప్రవహిస్తున్న అనంతల వాగు పొంగి ప్రవహించడంతో ఓ వాహనం కొట్టుకుపోయింది. గ్రామానికి చెందిన పొంగుల వాసుదేవరావు తన లగేజీ వాహనంపై బెజ్జిపురం నుంచి బుడతవలస వెళ్తుండగా వరద ఉధృతికి వాహనం కొట్టుకుపోయింది. స్థానికులు అప్రమత్తం కావడంతో డ్రైవర్‌ను రక్షించారు.



జలదిగ్బంధంలో పూడిలంక



వజ్రపుకొత్తూరు: పూడిలంక జలదిగ్బంధంలో చిక్కుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉప్పుటేరు పొంగి పొర్లుతోంది. బెండి గెడ్డ, సముద్రపు పోగురు ఎక్కువై ఉప్పుటేరులో భారీ వరద నిండు కుండలా ఉంది. పాత కాలిబాట గట్టు ఇప్పటికే మునిగిపోగా కొత్త రహదారిపై వరద వచ్చి చేరుతోంది. బయటకు వెళ్లే దారులు మూసుకుపోయాయి.

విస్తారంగా వానలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు 2082 మిల్లీమీటర్ల వర్షం పడింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు 1461.6 మిల్లీమీటర్ల వాన కురవగా, ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 620 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు రెండు గంటల్లోనే 228 మిల్లీమీటర్ల వాన నమోదైంది.

- జిల్లాలో 8 చోట్ల కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్నందున రాకపోకలు నియంత్రించారు.
- సముద్రంలో మూడు రోజుల వరకూ చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

నష్టం ఫొటోలు coskImsupdtd @gmail. com మెయిల్‌కి పంపించవచ్చు.

నగరం.. జలమయం

శ్రీకాకుళం నగరంలో పలు కాలనీలు జలమయమయ్యాయి. మురుగునీరు ఇళ్లలోకి చేరడంతో కాలనీ వాసులకు అవస్థలు తప్పలేదు. డీసీసీబీ కాలనీ, గోవిందనగర్ కాలనీ, ఏఎస్ఎన్‌కాలనీ, హోమియోనగర్‌కాలనీ, ఆర్‌కెనగర్‌కాలనీ, శాంతినగర్, విశాఖ-ఏ కాలనీ, విశాఖ-బి కాలనీ, బ్యాంకర్స్‌కాలనీ, ఆదిత్యనగర్‌కాలనీ, తోటపాలెం రోడ్డు ముంపులో చిక్కుకున్నాయి. - శ్రీకాకుళం(పీఎన్ కాలనీ)



ఆర్కేనగర్ కాలనీలో ఇదీ పరిస్థితి



ఆస్పత్రి రోడ్డు మీద చేరిన వర్షపు నీరు

చినుకుపడితే చెరువే..



చిన్న వర్షం పడితే హడ్కోకాలనీ చెరువులా మారుతోంది. ఇళ్లను వరద నీరు ముంచెత్తుతోంది. శాశ్వత పరిష్కారం చూపాలి.

- ఏ. కిరణ్, హడ్కోకాలనీ, శ్రీకాకుళం



ప్రయాణం 'బస్'తీ మే సవాలే

కాసింత వాన పడినా ఆర్టీసీ కాంప్లెక్స్ చిన్నపాటి చెరువులా మారిపోతోంది. శని, ఆదివారాల్లో కురిసిన వానకు కాంప్లెక్స్ జలమయమైంది. బస్సు ఎక్కేందుకు కూడా వీల్లేనంతగా వాన నీరు నిండిపోయింది. - శ్రీకాకుళం అర్బన్



బస్సు ఎక్కేందుకు అవస్థ



పార్సిల్ కార్యాలయం వద్ద..

ఏక దంతాయ.. బహు రూపాయ

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. ఏక దంతుడు అనేక రూపాల్లో కొలువుదీరాడు. విభిన్న రీతుల్లో ప్రతిమలు కనిపించాయి. మండలాలు కూడా ఆకట్టుకునేలా ఏర్పాటు చేశారు.




ఎల్.ఎన్.పేట: మోదుగువలసలో 25 అడుగుల ఎత్తైన వినాయక విగ్రహం



ఆమదాలవలస: పట్టణంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన 16 గణపతుల విగ్రహాలు



జి.సిగడాం: మొక్కజొన్న, గింజలు, కొబ్బరి పీచుతో తయారు చేసిన వినాయకుడు



ఇచ్ఛాపురం : బెల్లుపడ కాలనీలో ఏర్పాటుచేసిన అయోధ్య గణపతి



కాశీబుగ్గ: పలాసలో దీపాలతో వినాయకుని ఆకృతి



కాశీబుగ్గ: 20వ వార్డు లేబరుకాలనీలో భారీ సెట్



గార: ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేలా చల్లపేటలో బుల్లెట్ బండి గణేషుడు

క్లుప్తంగా

అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అవసరం అయితే తప్ప బయటకు రావద్దని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విన్నవించారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. రేపు రాత్రికల్లా ఒడిశాలోని పూరీ,పశ్చిమబెంగాల్‌లో దిఘ సముద్రం మధ్య తీరం దాటుతుందని..ఈ నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు మీకోసం వినతుల స్వీకరణ కార్యక్రమం రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వర్షాల కారణంగా జిల్లాస్థాయి మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో ప్రజలు వ్యయ ప్రయాసలకు లోనై వినతులు అందజేసేందుకు రావద్దని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ గ్రీవెన్స్ కూడా రద్దు చేశారు.

ఈసీ సమావేశం వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సమావేశం వాయిదా పడింది. సమావేశం వర్చువల్‌గా సోమవారం నిర్వహించాలని భావించారు. వరదల నేపథ్యంలో ఉన్నతాధికారులు సమావేశాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. అయితే ఎప్పుడు సమావేశం నిర్వహిస్తారన్నది తెలియరాలేదు.

ముద్దాయిల నుంచి మరికొంత బంగారం స్వాధీనం

టెక్కలి రూరల్: కొద్ది రోజులుగా టెక్కలితో పాటు మరికొన్ని గ్రామాల్లో అనేక దొంగతనాలకు పాల్పడిన వారిలో సుమారు నలుగురు వ్యక్తులను గత నెల 19వ తేదీన అదుపులో తీసుకున్న సంగతి తెలిసిందే. వారి వద్ద నుంచి కొంత మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకోగా.. తాజాగా మరికొంత బంగారాన్ని రికవరీ చేశారు. భువనేశ్వర్‌కి చెందిన ఎ1 సిభుదాస్, ఎ2 తరేమిరావులను సీఐ ఎ.విజయ్‌కుమార్ విచారించగా దొంగతనం చేసిన బంగారాన్ని సిభుదాస్ ఇంటిలో దాచినట్లు తెలిసింది. దీంతో ఒడిషా రాష్ట్రం ఖుర్దా జిల్లా భరతపూర్, సాయిరాం బస్తీలో గల అతడి ఇంటికి వెళ్లి 80 గ్రాముల బంగారం, దొంగిలించిన నగదుతో కొన్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

'కొన్న చిన్నారావు' అథ్లెటిక్స్ మీట్ వాయిదా

శ్రీకాకుళం న్యూకాలనీ: స్వర్గీయ కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీలు వాయిదా పడ్డాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో అథ్లెటిక్స్ మీట్ జరగనున్న శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో భారీగా వర్షపునీరు చేరడంతో పోటీల నిర్వహణ సాధ్యపడదని గుర్తించి అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్, మీట్ ప్రధాన నిర్వాహకులు కొన్న వెంకటేశ్వరరావు వాయిదా వేశారు. తదుపరి పోటీలు జరగనున్న తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఎస్ఈబీ కానిస్టేబుల్ మృతి: భర్త అరెస్టు



అనూష (ఫైల్)

నరసన్నపేట: స్థానిక జగన్నాథపురంలో నివసిస్తూ రణస్థలంలో ఎస్ఈబీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గుర్రాల అనూష (31) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనూష పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. విశాఖలో మృతి చెందినట్లు నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసులో ఆమె భర్త ఆమదాలవలసకు చెందిన కుమిలి విజయకుమార్‌ను అరెస్టు చేశామన్నారు. అనూష తల్లి అన్నపూర్ణమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి భర్తను అరెస్టు చేశామన్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు. ప్రేమించి పెళ్లి చేసుకున్న అనూష ఈ విధంగా మృతి చెందడంపై అనూష తల్లి అన్నపూర్ణ కన్నీటి పర్యంతమయ్యారు.

డీసీసీ అధ్యక్షునిగా అంబటి



డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా అంబటి కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ నుంచి అధికారికంగా ఆదివారం ఉత్తర్వులు విడుదల య్యా యి. గతంలో అంబటి కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీలో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి పనిచేసిన అనుభవం ఉంది. 12 ఏళ్ల పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శిగా, రెండేళ్ల పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అలాగే పార్టీ తరఫున అరకు, తూర్పుగోదావరి పార్లమెంట్‌లకు ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కూడా పోటీ చేశారు. ఈ సందర్భంగా అంబటి కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు.

గంజాయి బ్యాచ్ ఆటకట్టు

- భారీ సంఖ్యలో పట్టుబడిన గంజాయి 'బ్యాచ్'
- 22 కిలోల గంజాయితో పట్టుబడిన తొమ్మిది మంది
- అందరూ పాతికేళ్ల లోపు వారే
- వీరిలో జిల్లాకు చెందిన వారు ఏడుగురు, ఒడిశా వాసులు ఇద్దరు
- మరో ముగ్గురి కోసం పోలీసుల వేట
- విలేకరుల సమావేశంలో వెల్లడించిన ఎస్పీ మహేశ్వర రెడ్డి



పట్టుబడిన నిందితులతో అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో గంజాయి బ్యాచ్‌ను పోలీసులు పట్టుకున్నారు. 22 కిలోల గంజాయితో తొమ్మిది మంది దొరికారని, వీరిలో ఏడుగురు జిల్లాకు చెందినవారు కాగా ఇద్దరు ఒడిశా వాసులని.. మరో ముగ్గురు ఇతర రాష్ట్రాలకు చెందినవారు దొరకాల్సి ఉందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గంజాయికి బానిసలైన మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం విలేకరులతో మాట్లాడారు. పట్టుబడిన వారంతా 25 ఏళ్లలోపు యువకులే కావడం విశేషం. ఎస్పీ చెప్పిన వివరాల మేరకు..

ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌జిల్లా పాత్తంగి బ్లాక్ కందిలి గ్రామానికి చెందిన హరీష్ గుంత, బంక జోసెఫ్‌లు కలిసి అదే రాష్ట్రం బూరుగులపాడు గ్రామానికి చెందిన సీనా అనే గంజాయి సాగుచేసే వ్యాపారి నుంచి కిలో రూ.3 వేలు చొప్పున గత కొంతకాలంగా కొంటున్నారు. ఆ గంజాయిని శ్రీకాకుళానికి చెందిన పల్లంశెట్టి చందు, సైలాడ వేణుగోపాలరావు, కొల్లి యశోదరావు, అందాల సాయి నిఖిల్, చీకటి యోగేశ్వరరావు, జామి మోహన కృష్ణ, జలగడుగుల కృష్ణవంశీ, జలగడుగుల వికాస్‌లే కాక మరికొంతమందికి వారిచ్చే ఆర్డర్లపై గంజాయిని తీసు కొచ్చి కిలో రూ. 5 వేలు చొప్పున అంటే రూ. 2 వేలు లాభానికి అమ్ముతుండేవారు. హరీష్, జోసెఫ్‌ల వద్ద కొన్న గంజాయిని పైన పేర్కొన్న చందు తదితరులు 30 గ్రాముల గంజాయి ప్యాకెట్‌ని రూ.400 చొప్పున అంటే కిలో గంజాయిని సుమారు రూ. 13,300లకు అమ్ముకుని డబ్బులు చేసుకునేవారు.

దొరికారిలా..

ఎస్పీగా మహేశ్వర రెడ్డి బాధ్యతలు తీసుకున్నాక గంజాయి బ్యాచ్‌లపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో 'ఆపరేషన్ గంజాయి' పేరుతో ఈనెల 4న గంజాయి పీల్చే ఎనిమిదిమందిని తోటపాలెం, నగర పరిసరాల్లో ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలోని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎవరు ఎక్కడ అమ్మారు.. ఎక్కడి నుంచి వస్తున్నారన్న వివరాలన్నీ విచారణలో తెలుసుకుని కాపుగాశారు. ఈ నెల 7న (శనివారం) శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో సీఐ పైడపునాయుడు, ఎస్ఐ కృష్ణలు తమ సిబ్బందితో పొన్నాడ బ్రిడ్జి సమీప సాయిగిరి గుడి వద్ద మాటు వేయగా రెండు ద్విచక్రవాహనాల్లో ఐదు కిలోల గంజాయి తీసుకెళ్తున్న నలుగురు నిందితులు దొరికారు. వారిని దర్యాప్తు చేయగా వచ్చిన సమాచారంపై సీఐ పైడపునాయుడు, సెబ్ సీఐ, రెవెన్యూ అధికారులు, పోలీసులు అదే రోజు నగరంలోని వాంబే కాలనీ సమీప డచ్ బంగ్లా వద్ద మరో ఐదుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి 17 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన తొమ్మిదిమంది పల్లంశెట్టి చందు, కోలా అరుణ్‌కుమార్, సైలాడ వేణుగోపాలరావు, కొల్లి యశోదరావు, చీకటి యోగేశ్వరరావు, జామి మోహన్‌కృష్ణ, జలగడుగుల కృష్ణవంశీ, హరీష్ గుంత, బంక జోసెఫ్ నుంచి మొత్తంగా 22 కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇంకా గంజాయి సాగు చేస్తున్న ఒడిశా వ్యాపారి సీనా, మరో ఇద్దరు దొరకాల్సి ఉంది. గంజాయి వ్యసనానికి లోనైన వారిని వారి తల్లిదండ్రుల సమక్షంలో గానీ, డి-అడిక్షన్ రిహాబిలిటేషన్ కేంద్రాల ద్వారా గానీ కౌన్సిలింగ్ చేస్తామని ఎస్పీ తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఎస్‌బి, ప్రత్యేక బృందాల సిబ్బంది, డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్ఐలు కృష్ణ, వాసుదేవరావు (రూరల్), కానిస్టేబుళ్లు రవి, సూరిబాబు, జగదీష్‌లను ఎస్పీ అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

పని, భద్రత రెండూ ప్రధానమే



ప్రసంగిస్తున్న పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్

పలాస: దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు పనితో పాటు మెరుగైన వేతనాలు, పనిచేసే చోట తగిన భద్రత కల్పించాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య (పీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ కోరారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం ప్రగతి శీల కార్మిక సమాఖ్య జిల్లా మహాసభ జరిగింది. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవ నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మస్తాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న సుమారు 46 కార్మిక చట్టాలను రద్దు చేసి కేవలం 4 లేబరు చట్టాలను తీసుకొచ్చారంటూ పాలకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ షా డబుల్ ఇంజిన్ గవర్నమెంటు దేశంలోని సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా పీకేఎస్ జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. మహిళా కార్మికుల సమస్యలు చట్టాలు అనే అంశంపై ఆ సంఘం రాష్ట్ర నాయకురాలు అన్నపూర్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు బి.కొండారెడ్డి, జోగి కోదండరావు, కోత ధర్మారావు, బెలమల ప్రభాకర్, నల్లా హడ్డి, దున్న గోవిందరావు, తామాడ క్రాంతి, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అమర కళాకారుల వేదిక కళాకారులు తమ ఆటపాటలతో సభను ఉత్తేజ పరిచారు.

పండగ పూట విషాదం

- వేర్వేరు చోట్ల చెరువులో కలువ పువ్వుల కోసం వెళ్లి ఇద్దరు మృతి



చల్లా రామారావు (ఫైల్)



కిట్టాలపాడు పోలయ్య (ఫైల్)

సారవకోట: మండలంలోని రెండు గ్రామాల్లో శనివారం వినాయక చవితి పండగ పూట విషాదం అలముకుంది. చవితికి పూజలు చేసేందుకు కలువ పువ్వుల కోసం చెరువులో దిగి నీట మునిగి ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. చిన్నకిట్టాలపాడు పంచాయతీ వెంకంపేట గ్రామానికి చెందిన కిట్టాలపాడు పోలయ్య (46) గ్రామంలో ఉన్న కోనేరులో కలువ పువ్వుల కోసం వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. ఉదయం కొండ నుంచి పత్రి తీసుకొచ్చి గ్రామంలో పంచి అనంతరం చెరువులో కలువ పువ్వుల కోసం చెరువులోకి దిగి నీట మునిగి మృతి చెందాడు. అప్పటి వరకు తమకు పత్రి పంచిపెట్టి నీట మునిగి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య సావిత్రి, కుమారుడు సాయి కిరణ్, కుమార్తె స్నేహప్రియ ఉన్నారు. అలాగే నౌతళ గ్రామానికి చెందిన చల్లా రామారావు (48) గ్రామానికి సమీపంలో ఉన్న నీటగుంటలో కలువ పువ్వుల కోసం వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య నారాయణమ్మ, కుమారుడు సురేష్, కుమార్తె లక్ష్మి ఉన్నారు.

సీపీఆర్‌తో నిలిచిన ప్రాణాలు

<ins>కోటబొమ్మాళి:</ins>

ఒక యువ ఫిజియోథెరపిస్టు సకాలంలో స్పందించడంతో నిండు ప్రాణం నిలిచింది. కోటబొమ్మాళి శివారులోని శ్రీనివాస నగర్‌లో చిన్నప్పన్న కుటుంబం నివసిస్తోంది. శనివారం సాయంత్రం చిన్నప్పన్న బయటకు వెళ్లి ఇంటికి వచ్చి మంచంపై కుప్పకూలిపోయి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. భార్య లక్ష్మీకళ ఎంత పిలిచినా పలకలేదు. శరీరమంతా చెమటలు పట్టి ఉన్నాయి. దీంతో ఆందోళనగా పక్కనే నివసిస్తున్న లఖిణాన శ్రీనివాసరావు కుమార్తె యువ ఫిజియోథెరపిస్టు సంధ్యారాణికి సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి పరిశీలించారు. గుండె చప్పుడు వినిపించకపోవడం, శరీరమంతా చెమటలు పట్టి ఉండడంతో వెంటనే సీపీఆర్ చేశారు. కొద్ది నిమిషాల్లో చిన్నప్పన్న లేచి కూర్చున్నారు. చవితి వేళ ప్రాణాలు నిలబడడంతో కుటుంబమంతా సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు.




చిన్నప్పన్నకు సీపీఆర్ చేస్తున్న ఫిజియోథెరపిస్టు

11న ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులు పూర్తయిన విద్యార్థులకు ఈ నెల 11వ తేదీన అప్రెంటిస్ షిప్ మేళా జరగనుందని ఇంటర్ విద్య జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి శివ్వాల తవిటినాయుడు తెలిపారు. పీఎంఎన్ఏఎం పథకంలో భాగంగా ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐ కేంద్రంగా బుధవారం ఉదయం 9.30 గంటలకు అప్రెంటిస్‌షిప్ ఎంపికల ప్రక్రియ జరుగుతుందన్నారు.

లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న మంతిన



శ్రీకాకుళం న్యూకాలనీ: యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా వారి బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు విద్యా విభాగంలో అందించిన సేవలకు గాను జిల్లాకు చెందిన డాక్టర్ మంతిన వాసుదేవ ఆచారిని లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు-2024కు ఎంపికచేసింది. ఐదు దేశాలు పాల్గొన్న ఈ ఎంపికల్లో భారతదేశం తరఫున ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయునిగా ఆయన ఆన్‌లైన్‌లో అవార్డు అందుకున్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానానికి ఆనుకుని ఉన్న శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల పీడీగా పనిచేస్తూ... గిరిజన విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం యోగాతో పాటు క్రీడల్లో ఉన్నతంగా తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందుకుగాను ఇప్పటికే అవార్డులు, రివార్డులు అందుకున్న డాక్టర్ మంతిన తాజా మరో ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్, తదితరుల చేతులమీదుగా ఉపాధ్యాయుల దినోత్సవం రోజున సత్కారం అందుకున్నారు.

సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను వ్యతిరేకిస్తున్నాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ, పక్కనే భానుమూర్తి, మదన్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన పీఆర్సీ కసరత్తును వెంటనే ప్రారంభించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం శ్రీకాకుళం రామలక్ష్మణ జంక్షన్‌లో ఉన్న క్రాంతిభవన్‌లో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ రఘువర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికే పలు మార్లు విజ్ఞప్తి చేశామన్నారు. 117 జీఓను రద్దు చేసిన తర్వాత మాత్రమే మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ జరపాలన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ వంటి నూతన పెన్షన్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఒక్క పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అంగీకరిస్తామని స్పష్టంచేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామ్‌సుందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ అనిల్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలకు చేరువైన మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు వెనక్కు పంపించాలని కోరారు.

'కరిమి'కి పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు

శ్రీకాకుళం న్యూకాలనీ/కోటబొమ్మాళి: పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డును జిల్లాకు చెందిన కరిమి రాజేశ్వరరావు అందుకున్నారు. గుంటూరులో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఈయన అవార్డును అందుకున్నారు. దేశావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ లెక్చరర్-టీచర్స్ అసోసియేషన్‌తో పాటు 8 ప్రముఖ సామాజిక విద్యాసంస్థలతో కలిపి.. దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు విద్యా సామాజిక రంగంలో చేసిన విశేష కృషికిగాను ఈ అవార్డును అందజేశారు. అవార్డుతోపాటు ఘనంగా సత్కారం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈయన జిల్లాలోని కోటబొమ్మాళి మండలం కురుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాలలో సృజనాత్మక బోధనతో పాటు సోషల్ మీడియా ద్వారా ఆన్‌లైన్ తరగతుల నిర్వహణ, వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని సామాజిక స్పృహలో భాగమైనందుకు ఈ అవార్డు లభించింది. ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రుంకు హనుమంతుపురం, భార్య సింధురి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

జిల్లా స్థాయి క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు రేపు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం బేతాళ యువజన సంఘం 23వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించబోయే జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 10వ తేదీన 8, 9, 10 తరగతుల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా అదే రోజు చిత్రలేఖనం, వ్యాస ర చన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల పాఠశాలలు తమ ఎంట్రీలను రెండు రోజుల ముందు వరకు పంపించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 900004566 3, 9110784445 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పిడుగుపాటుకు 6 గొర్రెలు మృతి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో శనివారం కురిసిన వర్షాలకు గాను పిడుగు పడి 6 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరి సోడిమూడి నాగేష్ శనివారం మధ్యాహ్నం కల్లేపల్లి కళాక్షేత్రం పరిసర ప్రాంతంలో గల ఇసుక దిబ్బెల వద్ద గొర్రెలను మేపుతుండగా ఒక్కసారిగా పిడుగు పడడంతో ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆరు గొర్రెలు చనిపోయాయి. ప్రస్తుతం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.